
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట 5
బుధవారం 17 జూలై 2024



సిద్దిపేటలో రెండు సెంటర్లు

- 18 నుంచి ఆగస్టు 5 వరకు డీఎస్సీ
- అన్ని ఏర్పాట్లు పూర్తి
- అభ్యర్థులు 2 గంటల ముందే చేరుకోవాలి
- జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేట క్రైం, జూలై 16: జూలై 18 నుంచి ఆగస్టు 5 వరకు డీఎస్సీ పరీక్షలు జరగనున్నాయి. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మొట్టమొదటిసారిగా ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించనున్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఇందూర్ ఇంజనీరింగ్ కళాశాలతో పాటు, వెరిటాస్ అండ్ వెర్టస్ ఇంజనీరింగ్ సర్వీసెస్ సెంటర్లను కేటాయించారు. ఈ పరీక్షల నిర్వహణకు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షణ అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డీఎస్సీ పరీక్షలను ప్రతి రోజూ రెండు విడతలుగా నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి సెషన్ ఉదయం 9 నుంచి 11.30 వరకు, రెండవ సెషన్ మధ్యాహ్నం 2 నుంచి 4.30 వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు రెండు గంటల ముందే సెంటర్లకు చేరుకోవాలని సూచించారు. ఎగ్జామ్‌కు గంటన్నర ముందు నుంచే లోనికి అనుమతిస్తామని, పరీక్ష సమయానికి 10 నిమిషాల ముందే గేట్లు మూసివేస్తామని స్పష్టం చేశారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు ఆధార్, బాల్‌పాయింట్ పెన్ వెంట తెచ్చుకోవాలన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, డిజిటల్ వాచ్‌లు లోనికి అనుమతి లేదని చెప్పారు.



సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్‌లోని సివిల్ సప్లయ్ గోదాములో బియ్యం బస్తాలకు బూజు

పేదల బియ్యం.. పందికొక్కుల పాలు..!

సంగారెడ్డి జిల్లాలో గత డిసెంబర్‌లో అక్రమంగా తరలిస్తున్న 236 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. ఆ బియ్యాన్ని జిల్లా కేంద్రంలోని సివిల్ సప్లయ్ స్టాక్ గోదాంలోకి తరలించారు ఆ తర్వాత అధికారుల అనుమతితో ఈ బియ్యాన్ని వేలం వేయాలి. కానీ, ఇప్పటివరకు ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆ బియ్యం కాస్తా గోదాములోనే పందికొక్కులకు, పురుగులకు ఆహారంగా మారుతోంది.

సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండల కేంద్రంలోని గోదాములో ఏడాది క్రితం పట్టుకున్న 62 క్వింటాళ్ల అక్రమ బియ్యాన్ని నిల్వ చేశారు. ఈ బియ్యాన్ని వేలం వేయకపోవడంతో ఎక్కడికక్కడ పాడైపోతున్నాయి. రంగుమారడంతో పాటు బూజు కూడా పట్టాయి. మూగజీవాలకే తప్ప మనుషులు తినడానికి పనికొచ్చేలా కనిపించడంలేదు.

- అక్రమంగా పట్టుబడితే అంతే..!
- నెలల తరబడిగా సివిల్‌సప్లయ్ గోదాముల్లోనే..
- రంగుమారి, పురుగులు పట్టి, గడ్డకట్టిన దుస్థితి
- ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో 16వేల క్వింటాళ్లు పట్టివేత

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జూలై 16: సంగారెడ్డి, దౌల్తాబాద్ సివిల్ సప్లయ్ స్టాక్ పాయింట్లలోనే కాదు. ఉమ్మడి జిల్లాలోని పలు గోదాముల్లో అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్న రేషన్ బియ్యం పనికి రాకుండా పోతుంది. పట్టుకున్న సమీప గడువులోనే సంబంధిత అధికారుల అనుమతితో ఈ బియ్యాన్ని వేలం వేయాలి. తద్వారా ఆదాయంతో పాటు బియ్యాన్ని వినియోగించే అవకాశం ఉంటుంది. కానీ తాజా పరిస్థితుల నేపథ్యంలో ఆదాయం కోల్పోవడమే కాకుండా బియ్యం ఎవరికీ కాకుండా పోతోంది.

ప్రభుత్వ ఖజానాకు గండి..

పేదలకు చెందాల్సిన రేషన్ బియ్యాన్ని దళారులు కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయిస్తున్నారు. కిలోకు రూ.12 చొప్పున కొంటున్నారు. పక్కరాష్ట్రాల్లో రూ.20పైచిలుకు ధరతో అమ్ముతున్నారు. లబ్ధిదారులతోపాటు రేషన్‌షాపుల్లో సేకరించిన ఈ బియ్యాన్ని అడ్డదారుల్లో రాష్ట్రం దాటించే ప్రయత్నంలో పట్టుబడుతున్నాయి. ఇలా స్వాధీనం చేసుకున్న బియ్యమే గోదాముల్లో పేరుకుపోతున్నాయి. రేషన్‌షాపులపై, దళారులపై నిఘా పెట్టకపోయినప్పటికీ కనీసం సీజ్ చేసిన బియ్యంపై కూడా దృష్టిసారించకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఫలితంగా ప్రభుత్వ ఖజానాకు భారీగానే గండిపడుతోంది. బియ్యాన్ని విక్రయించవద్దని ప్రచారం చేయకపోవడం, రేషన్‌షాపులను తనిఖీలు చేయడంలో అలసత్వం వహించడమే ప్రధాన కారణాలుగా భావించాల్సిన పరిస్థితి నెలకొన్నది.



సిద్దిపేటలోని గోదాములో నిల్వ ఉన్న అక్రమ రేషన్‌బియ్యం

రోజూ ఏదో ఓ చోట..

జనవరి నుంచి ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 16వేల క్వింటాళ్ల బియ్యం పట్టుబడిదంటే అతిశయోక్తికాదు. సిద్దిపేట జిల్లాలో 1,275 క్వింటాళ్లు సీజ్ చేసి 40 కేసులు నమోదు చేశారు. దాదాపు టాస్క్‌ఫోర్స్ పోలీసులే వీటిని చేధించారు. ఇక మెదక్ జిల్లాలో 290 క్వింటాళ్ల బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుంటే పలు సందర్భాల్లో పట్టుకున్నారు. అత్యధికంగా సంగారెడ్డి జిల్లాలో 14,446 క్వింటాళ్ల అక్రమ రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. ఈ జిల్లాలో నిత్యం ఏదో ఒక చోట బియ్యం పట్టుబడడం సాధారణమైంది. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు తరలించే క్రమంలో ఈ దందా బట్టబయలవుతోంది.వివిధ జిల్లాల్లో సేకరించిన బియ్యాన్ని సంగారెడ్డి జిల్లా మీదుగా తరలించడమే భారీ నిల్వలకు కారణంగా చెప్పవచ్చు. ఈ జిల్లాలోని నారాయణ్‌ఖేడ్, జహీరాబాద్, జోగిపేట, పటాన్‌చెరు, సంగారెడ్డి స్టాక్ పాయింట్లలో పెద్ద ఎత్తున అక్రమ బియ్యాన్ని నిల్వ చేశారు.



సంగారెడ్డి గోదాములో పురుగులు పట్టి, గడ్డలు కట్టిన బియ్యం నిల్వలు

అనుమతులకూ ఎదురుచూపు

అక్రమ రేషన్ బియ్యాన్ని వేలం వేయాలంటే ఉన్నతాధికారుల నుంచి అనుమతులు రావాలని సంబంధిత అధికారులు చెబుతున్నారు. అయితే, ఎప్పటికప్పుడు వేలం వేయడంతో పరిస్థితి ఇందాకా వచ్చేది కాదు. కానీ నెలల తరబడిగా జాప్యం చేయడంతోనే బియ్యం పాడవుతున్నాయి. సంబంధిత జిల్లా కలెక్టర్లు ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారిస్తే అక్రమ బియ్యాన్ని సక్రమంగా సద్వినియోగం చేసుకోవడం సులభమవుతుంది. లేదంటే ఇలాగే పేరుకుపోయి పురుగులకు, పందికొక్కులకు ఆహారమవుతుంది.

నూతన డీజీపీని కలిసిన సీపీ



సిద్దిపేటక్రైం, జూలై 16: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా నియమించిన డీజీపీ డాక్టర్ జితేందర్‌ను మంగళవారం సిద్దిపేట సీపీ డాక్టర్ బి.అనురాధ హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మల్టీజోన్ వన్ నూతన ఐజీపీగా నియమితులైన చంద్రశేఖర్‌రెడ్డిని కూడా మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

గోరింటాకు సంబురాలు



ఆషాడమాసాన్ని పురస్కరించుకుని చిన్నకోడూరు మండలకేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో మంగళవారం గోరింటాకు సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు చేతులకు గోరింటాకు పెట్టుకున్నారు. అలాగే, గోరింటాకు విశిష్ఠతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.

చిన్నకోడూరు, జూలై 16

ఓపీ సేవల్లో దుబ్బాక ఆసుపత్రికి రెండవస్థానం



దుబ్బాక, జులై16: ప్రభుత్వాసుపత్రుల్లో అవుట్ పేషంట్ సేవల్లో దుబ్బాక ఆసుపత్రి రాష్ట్రస్థాయిలో రెండవస్థానంలో నిలిచింది. ఈ ఏడాది జనవరి 1 నుంచి జూలై 14 వరకు ఈ ఆసుపత్రిలో 28,990 మంది, ఏబీహెచ్‌ఏ (ఆయుష్మాన్ భారత్) క్యూఆర్ కోడ్ ద్వారా 1107 మంది మొత్తం 30,097 మంది రోగులు ఓపీ సేవలు పొందారు. అందుకు గాను రాష్ట్రస్థాయిలో రెండవ స్థానం దక్కింది. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ హేమరాజ్ మాట్లాడారు. దుబ్బాక ఆసుపత్రిలో సిబ్బంది తోడ్పాటు వల్లే రోగులకు మెరుగైన సేవలందిస్తున్నామన్నారు. వైద్యుల సేవలను కూడా దుబ్బాక ప్రజలు అభినందించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా శస్త్రచికిత్సలు చేస్తూ కార్పొరేట్‌కు దీటుగా పేదల ఆసుపత్రిగా తీర్చిదిద్దారని వారు కొనియాడారు. ఇక ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ జిల్లా ప్రభుత్వాసుపత్రి ప్రథమ స్థానంలో నిలవడం గమనార్హం.



సంస్కృతికి ప్రతీక సీత్లా

7లో

- ఆషాఢమాసం నుంచి శ్రావణమాసం మధ్యన ఉత్సవాలు
- గిరిజన తండాల్లో ప్రారంభమైన వేడుకలు

అక్కన్నపేట మండలం మల్చెరువు తండాలో నెత్తిన నైవేధ్యంతో గిరిజన యువతులు, మహిళలు(ఫైల్)

ధిక్కార స్వరం మూగబోయింది

7లో

- విశ్రాంత ఆచార్యులు కారంపురి సుభాష్ కన్నుమూత

60రోజులు.. రూ.1.05కోట్లు

- మల్లన్న ఆలయంలో హుండీ లెక్కింపులు
- బంగారు గొలుసు, ఉంగరం అపహరణ
- కాసేపటికి గొలుసును గుర్తించిన ఆలయవర్గాలు



కరెన్సీ లెక్కిస్తున్న సేవాసమితి మహిళాసభ్యులు

చేర్యాల, జూలై 16: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో మంగళవారం కానుకలు, ఒడిబియ్యం హుండీల లెక్కింపులు చేపట్టారు. ఈవో బాలాజీశర్మ ఆధ్వర్యంలో సత్యసాయి సేవాసమితి మహిళాసభ్యులు లెక్కించారు. రూ.1,05,25,903 నగదు, 110 గ్రాముల బంగారం, 7.600 కిలోల వెండి, 11 క్వింటాళ్ల ఒడిబియ్యం, 16 విదేశీ కరెన్సీ నోట్లు ఉన్నాయని ఈవో తెలిపారు. ఈ ఆదాయం 60 రోజుల్లో సమకూరినట్లు ఆయన పేర్కొన్నారు. లెక్కింపులలో ఆలయ ఏఈవోలు బుద్ధి శ్రీనివాస్, గంగా శ్రీనివాస్, అర్చకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మల్లన్నా...దొంగ ఎవరన్నా!?

హుండీ లెక్కింపుల్లో లభ్యమైన బంగారు మొక్కుబడుల్లో ఉంగరం అపహరణకు గురవడంతో పాటు గుర్తుతెలియని వ్యక్తులు గొలుసు చోరీకి యత్నించడం స్థానికంగా కలకలం రేపింది. హుండీ లెక్కింపుల్లో భాగంగా సిబ్బంది కరెన్సీ నోట్లను కట్టకట్టడంతో పాటు బంగారు, వెండి మొక్కుబడులను ఆలయ ఈవో, ద్వితీయశ్రేణి అధికారులకు అందించగా వారి సమక్షంలోనే టేబుల్‌పై అమర్చారు. మధ్యాహ్న భోజనం అనంతరం ఏఈవో గంగా శ్రీనివాస్, ఏఎస్‌ఐ రామ్మూర్తి, మరో వ్యక్తి టేబుల్ వద్దకు చేరుకున్నారు. బంగారు ఆభరణాల్లో గొలుసు, ఉంగరం లేకపోవడాన్ని గుర్తించి ఆలయ ఈవో బాలాజీకి తెలిపారు. వెంటనే వారు సిబ్బందిని తనిఖీ చేయగా బంగారు గొలుసు టేబుల్ సమీపంలోని చెత్తపేపర్ల కుప్పలో లభ్యమైంది. ఉంగరం మాత్రం అపహరణకు గురైంది. ఈవో బాలాజీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కొమురవెల్లి ఎస్‌ఐ రాజుగౌడ్‌కు ఆలయానికి చేరుకుని విచారించారు. సీసీపుటేజీలను పరిశీలించేందుకు ప్రయత్నం చేసినా పాస్‌వర్డ్ పనిచేయక డాటా ఓపెన్‌కాలేదు. ఏజెన్సీ నిర్వాహకుడికి ఫోన్‌చేస్తే తాను అందుబాటులో లేనని చెప్పడంతో విచారణను నిలిపివేశారు.



హుండీల్లో లభ్యమైన బంగారు, వెండి మొక్కుబడులు

ఇంటిదొంగ ఎవరై ఉంటారు..!

ఈవో, ఏఈవోల సమక్షంలోని టేబుల్‌పై ఉన్న బంగారు గొలుసు కొద్దిపాటి సమయంలోనే చెత్తకుప్పల్లో ప్రత్యక్షమవడంతో ఎవరు అపహరించారో ఎటు తేల్చలేక ఎవరికి వారుగా మీమాంసలో పడిపోయారు. అధికారులు కూర్చున్న గోడకు సీసీ కెమెరా ఉన్నప్పటికీ ఈవిషయం అందులో నిక్షిప్తమైందా లేదా అన్నది విచారణలో తేలనుంది. గతంలోనూ భక్తులు హుండీల్లో వేసిన బంగారు మొక్కుబడులు లెక్కింపులలో కానరాకపోగా, తాజాగా చోటుచేసుకున్న సంఘటన వెనక ఎవరిహస్తం ఉందన్న విషయం ఆసక్తికరంగా మారింది. ఈవిషయమై ఈవో బాలాజీశర్మను వివరణ కోరగా, ఉంగరాన్ని తాను పరిశీలించలేదని, అపహరణకు గురైందన్న విషయం తెలియడంతో వెతకగా గొలుసు మాత్రం చెత్తకుప్పల్లో దొరికిందన్నారు. సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి తగుచర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.



ప్రభుత్వాసుపత్రుల్లో తగ్గిన ప్రసవాలు

ప్రైవేట్ ఆసుపత్రులకు మొగ్గు



ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అనుబంధ మెడికల్ కళాశాల

- సిద్దిపేట జీజీహెచ్‌లో గతేడాది జనవరి నుంచి జూన్ వరకు 1088 నార్మల్ డెలివరీలు
- ఈ ఏడాది ఆరునెలల్లో 1005 సాధారణ ప్రసవాలు
- ప్రస్తుతం న్యూట్రిషన్ కిట్లు కొనసాగింపు
- కేసీఆర్ కిట్టుకు బ్రేక్
- ప్రత్యామ్నాయం ఆలోచించాలంటున్న గర్భిణులు, బంధువులు

సిద్దిపేట టౌన్, జూలై 16: ప్రజలకు ప్రభుత్వాసుపత్రులపై నమ్మకం సన్నగిల్లడమో.. లేదంటే అధికారులు అవగాహన కల్పించకపోవడమో కానీ క్రమక్రమంగా సర్కారు దవాఖానాల్లో ప్రసవాల సంఖ్య తగ్గుతుంది. ప్రభుత్వాసుపత్రులను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో, అలాగే గర్భిణులను ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం కేసీఆర్ కిట్టు పేరిట పలు పథకాలను ప్రారంభించింది. పథకంలో భాగంగా మగపిల్లాడు పుడితే రూ. 12వేలు, ఆడపిల్ల పుడితే రూ. 13వేలు అందించడంతో గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రులకే ప్రాధాన్యం చూపించారు. కొద్దికాలం తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం కేసీఆర్ కిట్టు అందజేసినా డబ్బును మాత్రం చెల్లించలేదు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కేసీఆర్ కిట్టుకు బ్రేక్ పడింది. అయితే, గత ప్రభుత్వంలో మంజూరై జిల్లావ్యాప్తంగా పలు ఆసుపత్రుల్లో నిల్వ ఉన్న కిట్ల వరకు మాత్రమే గర్భిణులకు పంపిణీ చేశారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి, వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సూచనల మేరకు గర్భిణులకు కేసీఆర్ కిట్లకు బదులు న్యూట్రిషన్ కిట్లను అందిస్తున్నారు. కిట్టు పేరు మార్పిడి, తదితర విధివిధానాలను తీసుకొచ్చేందుకు రూపకల్పన చేస్తున్నారు. త్వరగా ప్రభుత్వ కిట్టు అందుబాటులోకి వస్తే గర్భిణులు మళ్లీ ప్రభుత్వాసుపత్రుల బాట పట్టే అవకాశాలున్నాయి. అలాగే ప్రభుత్వ ఆసుపత్రుల్లో సకల సౌకర్యాలు, వసతులు, వైద్యులు అం దిస్తున్న చికిత్సలపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం వైద్యశాఖ అధికారులపై ఎంతైనా ఉంది.




ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలకు వచ్చిన గర్భిణులు

తగ్గిన ప్రసవాల సంఖ్య


సిద్దిపేట జిల్లావ్యాప్తంగా గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య క్రమక్రమంగా తగ్గుతుంది. గతేడాది నార్మల్ డెలివరీలు జనవరిలో 190, ఫిబ్రవరిలో 180, మార్చిలో 199, ఏప్రిల్‌లో 181, మే 176, జూన్ 162 చొప్పున మొత్తం 1088 నమోదయ్యాయి. ఈ ఏడాది జనవరిలో 182, ఫిబ్రవరిలో 155, మార్చిలో 174, ఏప్రిల్‌లో 193, మేలో 150, జూన్‌లో 151 మొత్తంగా 1005గా నమోదయ్యాయి. ఇలాగే కొనసాగితే రాబోయే ఆరునెలల్లో మరింత తక్కువగా ప్రసవాల సంఖ్య నమోదయ్యే అవకాశాలు లేకపోలేదు. నార్మల్ డెలివరీల తరహాలోనే సెక్షన్ల సంఖ్య కూడా నమోదు కావడం గమనార్హం.

సిజేరియన్ చేయాలంటూ వైద్యులపై ఒత్తిడి

సిద్దిపేట జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అనుబంధ మెడికల్ కళాశాలకు వస్తున్న గర్భిణులు త్వరగా డెలివరీ చేయాలంటూ వైద్యులను ఇబ్బంది పెడుతున్నారు. మొదటి కాన్పును సాధారణ ప్రసవం చేసేందుకు వైద్యులు ప్రయత్నిస్తున్నా.. గర్భిణులు, వారి బంధువులు మాత్రం తమ పరపతి ఉపయోగించి నాయకులతో ఫోన్లు చేయిస్తూ ఆపరేషన్ చేయాల్సిందిగా వైద్యులపై ఒత్తిడి తెస్తున్నారు. నార్మల్ డెలివరీ కాని పక్షంలో సిజేరియన్ చేస్తామని చెబుతున్నా వినడం లేదని డాక్టర్లు వాపోతున్నారు.
















ఎరువులను మోతాదులో పిచికారీ చేయాలి

● మెదక్ జిల్లా వ్యవసాయధికారి గోవింద్



గవ్వలపల్లి ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్

చిన్నశంకరంపేట, జూలై 16: రైతులు పంటల సాగుకు మోతాదుకు మించకుండా ఎరువులను పిచికారీ చేయాలని జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ అన్నారు. మంగళవారం చిన్నశంకరంపేట మండల కేంద్రంతో పాటు గవ్వపల్లి, మదూర్ గ్రామాల్లోని డీసీఎంఎస్, పీఏసీఎస్, ఆగ్రోస్ కేంద్రాలను సందర్శించి వాట్సాప్ మొబైల్ యాప్, ఎరువులకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించి మాట్లాడారు. ప్రతీ వారం ఐదు ఎరువులు, క్రిమి సంహారక మందుషాపులను ఏవో, ఏఈవోలు తనిఖీ చేస్తారన్నారు. ఎరువుల దుకాణ డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలన్నారు. ఆయన వెంట ఏవో లక్ష్మీ, ప్రవీణ్ ఉన్నారు.

పత్తి పంట సాగుపై రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ

పుల్‌కల్, జూలై 16: మండలంలోని గొంగ్లూరు గ్రామంలో పత్తిపంట సాగుపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. స్థానిక రైతువేదిక భవనంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సంగుపేట ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాహుల్‌విశ్వకర్మ హాజరై వరి, పత్తి తదితర పంటల సాగుపై రైతులు ఎప్పటికప్పుడూ మెళకువలు తీసుకోవాలని సూచించారు. వరి నారుమడి దశలో ఉన్నందున ప్రధాన పొలంలో నాటేముందు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరాకు సరిపడా నారుమడిలో 800 గ్రాములు వేసుకోవాలని, తద్వారా కాండం తొలిచే పురుగు నివారించబడుతుందన్నారు. కలుపు నివారణకు వరి, నారుమడిలో ఒకటి, రెండురోజుల్లోపు క్లించర్ (సైహలోపాప్-పి-బ్యుటైల్) 1.5 మిల్లీ లీటర్లు, నామిని గోల్డ్ (బిస్ పైరిబాక్ సోడియం) 0.5 మిల్లీ లీటర్లు వినియోగించాలని సూచించారు.

ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పించాలి

● తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు కాసాల రాఘవేందర్‌రెడ్డి

సంగారెడ్డి అర్బన్, జూలై 16: స్వామినాథన్ కమిటీ సూచన ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేసిన ఎంఎస్‌పీ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి, ప్రకటించిన ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పించాలని తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు కాసాల రాఘవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సంగారెడ్డిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఏర్పడి 10 ఏళ్లు గడిచినా ఏ ఒక్క రైతు కుటుంబం పేరు మీద కనీసం 10 వేల బ్యాంక్ డిపాజిట్లు లేకపోవడం రైతుల దుస్థితికి నిదర్శనమన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నటువంటి పరిస్థితుల్లో రైతులకిచ్చిన హామీ మేరకు రైతు రుణ మాఫీ, రైతుభరోసా, పంటల బీమా తదితర వాటిని మొదటి ప్రాధాన్యతతో సుమారు 42 వేల కోట్లు మంజూరు చేయడానికి నిర్ణయించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు రాంరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నర్సింహులు, వెంకటేశ్వర్, మల్లేశం, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లులో విజిలెన్స్ తనిఖీలు

● వరిధాన్యం నిల్వలు, రికార్డుల పరిశీలన



రామాయంపేట మిల్లులో అధికారుల తనిఖీలు

రామాయంపేట, జూలై 16: రైస్ మిల్లులో ప్రభుత్వానికి సంబంధించిన ధాన్యం నిల్వలు సరిగ్గా ఉన్నాయా.. లేవా అన్న దానిపై అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు రామాయంపేట మండల పరిధి కోనాపూర్ మిల్లులో మంగళవారం టాస్క్‌ఫోర్స్, విజిలెన్స్ బృందం రికార్డులు పరిశీలించింది. అనంతరం ధాన్యం నిల్వలను చూశారు. విజిలెన్స్ ఎస్‌ఐ పుల్లయ్య నేతృత్వంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సీఎంఆర్ షీట్ ప్రకారంగా బియ్యం, వరి బస్తాల లెక్కలు చూస్తున్నామన్నారు. ఏమైనా తేడా ఉన్నట్లు తేలితే సంబంధిత కమిషనర్‌కు నివేదిక అందజేస్తామన్నారు.

తూప్రాన్‌లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్



16వ వార్డులో డ్రైనేజీని శుభ్రం చేస్తున్న సిబ్బంది

తూప్రాన్, జూలై 16: తూప్రాన్ పట్టణ మున్సిపల్ పరిధి 16వ వార్డులో మంగళవారం వానాకాలం పురస్కరించుకుని స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపట్టారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతికృష్ణ ఆధ్వర్యంలో వార్డులో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. వీధుల్లో ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ప్రజల సమస్యలు తెలుసుకుంటూ.. వాటి పరిష్కారానికి కృషి చేశారు. ఈ కార్యక్రమంలో 16వ వార్డు కౌన్సిలర్ కొడిప్యాక నారాయణగుప్తా, కమిషనర్ ఖాజా మొహిజుద్దీన్, కౌన్సిలర్లు శ్రీశైలంగౌడ్, రాజు పాల్గొన్నారు.

కోహీర్‌లో 'రైతునేస్తం' ట్రయల్ రన్

కోహీర్, జూలై 16: మండల కేంద్రమైన కోహీర్‌లోరి రైతువేదికలో వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం రైతునేస్తం కార్యక్రమానికి ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి నవీన్ కుమార్ మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ ఫ్లాట్ ఫారం విధానం ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్నదన్నారు. రైతునేస్తం కార్యక్రమం ద్వారా వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సమస్యలపై రైతులతో చర్చిస్తారన్నారు. గ్రామాల నుంచే రైతులు ఆన్‌లైన్‌లో తమ పంటలకు సంబంధించిన సలహాలు, సూచనలు అందుకోవటం, తమ అనుభవాలను ఇతర రైతులతో పంచుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ భిక్షపతి, మండల వ్యవసాయ అధికారి నవీన్‌కుమార్, ఏఈవోలు శ్రీనివాస్, వేదవతి, మౌనిక, సవిత, స్వాతి, ఆత్మ బీటీఎం చరణ్ తదితరులు పాల్గొన్నారు.



రైతు నేస్తం ట్రయల్ రన్‌కు హాజరైన రైతులు



అక్కన్నపేట మండలంలోని మల్చెరువుతండాలో నెత్తిన నైవేద్యంతో గిరిజన యువతులు, మహిళలు(ఫైల్)

సంస్కృతికి ప్రతీక సీత్లా

- ఆషాఢమాసం నుంచి శ్రావణమాసం మధ్యన ఉత్సవాలు
- గిరిజన తండాల్లో ప్రారంభమైన వేడుకలు

అక్కన్నపేట, జూలై 16: గిరిజన తండాల్లో సీత్లా భవానీ(దాటుడు) పండుగ సందడి మొదలైంది. గిరిజనుల సంస్కృతికి ప్రతీకైన ఈ పండుగను ప్రతిఏటా ఆషాఢమాసం నుంచి శ్రావణమాసం మధ్యన పెద్ద పూసాల కార్తెలో అమ్మవారికి ఇష్టమైన మంగళవారం రోజున నిర్వహించుకోవడం తాత ముత్తాతల కాలం నుంచి వస్తున్న ఆనవాయితీ. గిరిజనుల పశుసంపద రక్షణ కోసం, వర్షాలు సకాలంలో కురిసి పంటలు బాగా పండాలని ప్రాచీన కాలం నుంచి జరుపుకునే పండుగ సీత్లా ఉత్సవం. ఈ వేడుకను గిరిజనులు ప్రత్యేక భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలోని గిరిజనతండాల్లో సీత్లా సందడి ప్రారంభమైంది. ఈ పండుగను దాటుడు పండుగగా గిరిజనులు పిలుస్తారు.

లాళీ(గాలికుంటువ్యాధి)లతో ముప్పు

పశుపోషణకు మారుపేరైన గిరిజనులు పూర్వ కాలం నుంచి వందల సంఖ్యలో పశుసంపదను కలిగి ఉండేవారు. పశువులకు గడ్డి బాగా లభించే ప్రాంతాలను ఎంచుకొని తండాలుగా ఏర్పాటు చేసుకుని అక్కడే జీవనం సాగించేవారు. గ్రామాలకు దూరంగా అడవుల్లో నివసించడంతో వాతావరణంలో మార్పులు వచ్చినప్పుడల్లా పశువులు రోగాల బారినపడేవి. వర్షాకాలం మొదలుకాగానే తండాల్లోని పశువులు వందల సంఖ్యల్లో మరణించేవి. జ్వరం, విరేచనాలు, కాలుడెక్కలు చెడిపోవడం, నోరుచెడి మేత మేయకపోవడం వంటి లక్షణాలతో పశువులు ప్రాణాలు కోల్పోయేవి. ఈ జబ్బులను గిరిజనులు అప్పట్లో లాళీ (గాలికుంటు వ్యాధి)గా పిలిచేవారు.

గిరిజన పెద్ద కలలో కనబడ్డ సీత్లా దేవత

పశుసంపద మరణిస్తూ బాధపడుతున్న తరుణంలో పూర్వం ఓ గిరిజన పెద్ద కలలో గిరిజనుల ఏడుగురు దేవతల్లో చిన్నదైన సీత్లా భవానీ దేవత కనిపించి తనను పూజిస్తే పశుసంపద దక్కుతుందని చెప్పడంతో అప్పటి నుంచి గిరిజన తండాల్లో ఈ పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. గిరిజనులు ఇళ్లల్లో కాకుండా తండా చివరలో ఏడుగురు అక్కాచెల్లెళ్లయిన (తుల్జా భవానీ, దుర్గా భవానీ, హింగ్లా భవానీ, అంబ భవానీ, గండి భవానీ, మత్రా భవానీ, సీత్లా భవానీ) దేవతల ప్రతిమలను పొడవాటి రాళ్లతో తయారుచేసి ఒకే వరుసలో ప్రతిష్ఠించి వాటికి ఎదురుగా వంద అడుగుల దూరంలో లుంకడ్యా ప్రతిమను ఏర్పాటు చేస్తారు. ఏడుగురు అమ్మవార్లలో చిన్నదైనా సీత్లా భవానీ పేరిట పండుగ నిర్వహిస్తారు. అమ్మవారికి ప్రీతిపాత్రమైన మంగళవారం అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటే తమ పశు సంపదకు ఎలాంటి హాని జరగదని గిరిజనుల నమ్మకం.

కన్నె పిల్లలు ఇచ్చే నైవేద్యం

సీత్లా భవానీ ప్రతిమలను జాజు, పూలు, మామిడాలకులతో అలంకరిస్తారు. ఒకరోజు ముందు జొన్నలు, పప్పుధాన్యాలను నానబెట్టి తయారుచేసిన ఘూగ్రి (గుగ్గిళ్లను) సమర్పిస్తారు. దీన్ని గిరిజనులు వాంసిడో (ప్రాచిన నైవేద్యం)గా చెబుతారు. వాంసిడోను పెళ్లి కాని యువతులు తమ ఇళ్ల నుంచి తీసుకొచ్చి సీత్లా భవానీలకు సమర్పించడం ఆనవాయితీ.

పశువులపై చల్లడానికి ప్రత్యేక పదార్థం

ప్రత్యేక పూజలు చేసిన అనంతరం గిరిజనులు గొర్రెపోతులు, మేకలను బలి ఇచ్చేటప్పుడు వచ్చే రక్తం, ఉడకబెట్టిన గుడాలు కలిపి ప్రత్యేక పదార్థం తయారుచేస్తారు. బలి ఇచ్చిన గొర్రె, మేకల పేగులను దేవతా ప్రతిమల నుంచి లుంకడ్యా ప్రతిమ వరకు పరుస్తారు. వాటి మీద నుంచి పశువులను దాటిస్తూ ప్రత్యేకంగా తయారుచేసిన పదార్థాన్ని పశువులపై చల్లుతారు. ఇలా దీన్ని దాటుడు పండుగగా పరిగణిస్తారు. ఆషాఢ మాసంలో ఒక్కొక్క మంగళవారం ఒక్కొక్క తండాలో సీత్లా భవానీ పండుగను గిరిజనలు జరుపుకుంటున్నారు.



ధూళిమిట్ట మండలం సిద్బితండాలో సంప్రదాయ వేషధారణలో గిరిజన మహిళలు

ఘనంగా సీత్లా భవానీ ఉత్సవాలు

అక్కన్నపేట/ధూళిమిట్ట, జూలై 16: అక్కన్నపేట మండలంలోని కపూర్‌నాయక్‌తండా, తుక్కుతండా, పూసలతండా, దేవులనాయక్‌తండా, దూద్యనాయక్‌తండా, పంతులుతండా గ్రామపంచాయతీ పరిధిలోని దేవుతండా, పెద్దతండాల్లో గిరిజనులు మంగళవారం సీత్లాభవానీ ఉత్సవాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా గిరిజనులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అలాగే ధూళిమిట్ట మండలంలోని హనుమతండా గ్రామపంచాయతీ పరిధిలోని సిద్బితండాలో మంగళవారం సీత్లా భవానీ పండుగను గిరిజనులు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇస్లావత్ చిరంజీవి, భూక్య జగన్, నాగవత్ మోహన్, భూక్య పరిష, భూక్య మోహన్, ధరావత్ తవురియా, భూక్య రాజు, జాటోత్ నవీన్ పాల్గొన్నారు.

సెలవు దినంగా ప్రకటించాలి



రాష్ట్రవ్యాప్తంగా అన్ని గిరిజన తండాల్లో ఒకేరోజు సీత్లా భవానీ పండుగ జరుపుకోవాలి. అందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని గిరిజనుల పెద్దలతో సమావేశం నిర్వహించాలి. ప్రతి సంవత్సరం జూలైలో వచ్చే పెద్ద పూసాల కార్తెలో మొదటి లేదా రెండో మంగళవారంలో ఒక తేదీని నిర్ణయించాలి. ఆరోజు ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించాలి. ప్రతి సంవత్సరం ప్రభుత్వానికి వినతిపత్రాలు ఇస్తున్నా పట్టించుకోవడం లేదు.

\- నూనవత్ మోహన్ నాయక్, గిరిజన సంఘాల జిల్లా నాయకులు, అక్కన్నపేట



పంజగుట్టతండాలో నృత్యాలు చేస్తున్న గిరిజన మహిళలు(ఫైల్)



పెద్దతండాలో అమ్మవారికి మొక్కులు చెల్లిస్తున్న గిరిజనులు(ఫైల్)

భార్యాపిల్లలతో గొడవపడి ఆత్మహత్య

దుబ్బాక, జూలై 16: తాగి ఎందుకు వస్తున్నావని నిలదీసిన భార్య, కూతురుతో గొడవపడిన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అక్బర్‌పేట-భూంపల్లి మండలం బొప్పాపూర్ గ్రామానికి చెందిన వనమా పరశురాములు(51) తరచూ ఇంటికి తాగివచ్చేవాడు. గత ఆదివారం కూడా తాగొచ్చిన పరశురాములు భార్య బుజ్జి, కూతురు మంగతో గొడవపడ్డాడు. ఇంటిపక్కన గల పెద్దలు రాగులు నారాగౌడ్, ఎండీ సాబేరా పరశురాములు మందలించడంతో.. ఇకనుంచి తాగి రానని ఒప్పుకున్నాడు. అయితే అదేరోజు సాయంత్రం ఇంటిని వెళ్లిన పరశురాములు తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా మంగళవారం ఉదయం పల్లె ప్రకృతివనం వద్ద కుమారుడు అనిల్‌కు తండ్రి బైక్ కనిపించింది. లోపలికి వెళ్లి చూడగా పరశురాములు చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. భార్య ఫిర్యాదు మేరకు భూంపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ధిక్కార స్వరం మూగబోయింది

- విశ్రాంత ఆచార్యులు కారంపురి సుభాష్ కన్నుమూత



కారంపురి సుభాష్(ఫైల్)

దుబ్బాక, జులై 16 : దొరతనాన్ని ప్రశ్నించిన ధిక్కార స్వరం మూగబోయింది. దుబ్బాకకు చెందిన కాకతీయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్య డాక్టర్ కారంపురి సుభాష్ మంగళవారం రాత్రి హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో కన్నుమూశారు. దుబ్బాక పట్టణానికి చెందిన ఆయన విద్యార్థి దశలో దుబ్బాక దొరలపై ధిక్కార స్వరం వినిపించి, ఒక దొర భవనం ముందు తుపాకీ గొట్టంకు ఎదురుగా నిలబడి, బానిసత్వంను ప్రశ్నించారు. ఆయన దుబ్బాక వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘంలో జరిగిన అవినీతిపై 1962లో గోడలపై రాసి, ప్రశ్నించి, అప్పటి రాజకీయ నాయకుల బహిష్కరణకు గురై గ్రామం విడిచారు. హైదరాబాద్‌లో విద్యాభ్యాసం పూర్తి చేసి, తెలంగాణ ఉద్యమంలో కూడా కీలకంగా పని చేశారు. వరంగల్ కాకతీయ యూనివర్సిటీ ఆచార్యులుగా పని చేసిన ఆయన 2009లో ఉద్యోగ విరమణ పొందారు. దుబ్బాకలో 'మేమున్నాం' అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఆయన కుమారులు సుజయ్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో ఐటీ ఎలక్ట్రో డైరెక్టర్‌గా పని చేశారు. అంతేగాక వివిధ దేశాలనుంచి పెట్టుబడులు సాధించడానికి కృషి చేశారు. ప్రస్తుతం ఆయన షార్ప్ ఇంటర్‌నేషనల్ సంస్థ భారత విభాగంలో సీఈఓగా పని చేస్తున్నారు. రెండవ కుమారుడు సుశీల్ ఐటీ కంపెనీలను నిర్వహిస్తున్నారు. ఆయన సతీమణి శశికళ కూడా ఉపాధ్యాయురాలు, అధ్యాపకురాలుగా పని చేసి ఉద్యోగ విరమణ పొందారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం ప్రకటించారు. ఆయన అంత్యక్రియలు బుధవారం దుబ్బాకలో నిర్వహించనున్నారు.

ప్రతి పరిశ్రమలో టీబీ నివారణ కార్యక్రమాలు

- జిల్లా పరిశ్రమల శాఖ జీఎం ప్రశాంత్‌కుమార్

సంగారెడ్డి అర్బన్, జూలై 16: జిల్లాలోని ప్రతి పరిశ్రమలో టీబీ నివారణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ డి.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. సంగారెడ్డిలోని ఓ ప్రైవేటు హోటల్‌లో మంగళవారం ఐ యాం ఫర్ టీబీ ప్రాజెక్టులో భాగంగా టీబీ అలర్ట్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతీ పరిశ్రమలో టీబీ కార్యక్రమాలు నిర్వహిచాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. టీబీ నిర్మూలన సామాజిక బాధ్యతగా తీసుకోవడం ద్వారా చాలా కుటుంబాలను రక్షించిన వారమవుతామన్నారు. జిల్లా టీబీ ప్రోగ్రాం ఆఫీసర్ డా.రాజేశ్వరి మాట్లాడుతూ పరిశ్రమలలో పనిచేస్తున్న వారందరూ ఒకచోట ఉండి పనిచేయడం ద్వారా టీబీ ఒకరి నుంచి మరొకరికి సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుందన్నారు. టీబీ వచ్చినంత మాత్రానా కార్మికుడిని పనిలోంచి తీసేయాల్సిన అవసరం లేదని, వారికి తగిన సహకారం అందిస్తే వ్యాధి పూర్తిగా నయం చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో టీబీ అలెర్ట్ ప్రాజెక్టు సిబ్బంది పురుషోత్తం, కృష్ణ, శ్రీకాంత్, టీబీ విభాగం సిబ్బంది చెన్నయ్య, శ్రీనివాస్, దేవేందర్, నర్సిరెడ్డి, అరుణ పాల్గొన్నారు.

నర్సాపూర్ ప్రాంతీయ ఆస్పత్రిలో కాయకల్ప బృందం తనిఖీ

నర్సాపూర్, జూలై 16: నర్సాపూర్ ప్రాంతీయ ఆస్పత్రిని మంగళవారం కాయకల్ప బృందం తనిఖీ చేసింది. బృందంలోని డాక్టర్లు యాదయ్య, విజయలక్ష్మి, సాయి ఆస్పత్రిలో అందుతున్న వైద్యసేవలతో పాటు శానిటేషన్, పచ్చదనం, రోగుల పట్ల సిబ్బంది తీరు, తదితర అంశాలను పరిశీలించారు. తనిఖీలో భాగంగా ఇక్కడి సేవలను నమోదు చేసుకుని రాష్ట్రస్థాయిలో నివేదిక ఇస్తారు. రాష్ట్రస్థాయిలో పరిశీలించి సేవలకు తగ్గట్టు నిధులు కేటాయిస్తారని బృందం పేర్కొంది. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పావని ఆస్పత్రిలోని సదుపాయాలు వివరించారు.

పంచాయతీ కార్యదర్శుల బదిలీలకు కౌన్సెలింగ్

సంగారెడ్డి టౌన్, జూలై 16: సంగారెడ్డి జిల్లాలో గ్రామపంచాయతీ కార్యదర్శుల బదిలీల ప్రక్రియ కొనసాగుతున్నది. ఈ నెల 5వ తేదీ నుంచి ప్రారంభమైన బదిలీల ప్రక్రియ 20తో ముగియనున్నది. ఇందులో భాగంగానే మంగళవారం అర్హులైన పంచాయతీ కార్యదర్శులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా పంచాయతీ అధికారి తాండ్లె సాయిబాబాలు కౌన్సెలింగ్ జరిపారు. జిల్లాలో మొత్తం 647 గ్రామపంచాయతీలకుగాను 639 మంది పంచాయతీ కార్యదర్శులున్నారు. 2014లో నియామకమైన 428 మంది కార్యదర్శుల్లో 347 మందికి రెగ్యులర్ అయ్యింది. నాలుగేళ్లు పూర్తయిన కార్యదర్శుల్లో 40 శాతం మందికి సీనియారిటీ ప్రాతిపదికన బదిలీల ప్రక్రియ చేపట్టారు. అర్హులైన పంచాయతీ కార్యదర్శుల నుంచి ఈ నెల 12వ తేదీవరకు దరఖాస్తులను స్వీకరించారు. వీరందరికి 18వ తేదీవరకు కౌన్సెలింగ్‌ను పూర్తిచేసి 19,20 తేదీల్లో బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులను కలెక్టర్ క్రాంతి వల్లూరు జారీ చేయనున్నారు.

పాఠశాల సమయాల్లో 'వీడ్కోలు' వద్దు: డీఈవో

సంగారెడ్డి అర్బన్, జూలై 16: జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల సమయం ముగిసిన తర్వాతనే వీడ్కోలు సమావేశాలు జరుపుకోవాలని డీఈవో వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల సమయాల్లో ఎటువంటి పార్టీలు చేపట్టరాదని సూచించారు. ఈనెల 12న కలెక్టర్ వల్లూరు క్రాంతి పటాన్‌చెరు మండలం రామేశ్వరం బండ గ్రామాన్ని సందర్శించిన సందర్భంగా ఎంపీపీఎస్‌లో పాఠశాల వేళలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుల వీడ్కోలు పార్టీ నిర్వహించారని, తద్వారా గ్రామస్థులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారని ఆమె దృష్టికి రావడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం సర్క్యులర్ జారీ చేసినట్లు తెలిపారు. కావున విద్యార్థులు, గ్రామస్థులకు అసౌకర్యం, ఆటంకం కలగకుండా పాఠశాల సమయం ముగిసిన తర్వాతే ఫెయిర్ వెల్, ఇతర కార్యక్రమాలు నిర్వహించుకోవాలని డీఈవో జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పరిశోధనలో జవాబుదారీతనం ఆవశ్యం

- గీతం ఆతిథ్య ఉపన్యాసంలో బార్క్‌పూర్వ శాస్త్రవేత్త డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని



డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని ఆతిథ్య ఉపన్యాసం

పటాన్‌చెరు రూరల్, జూలై 16: పరిశోధనలో జవాబుదారీతనం ఆవశ్యమని, పరిశ్రమ అవసరాలను అర్థం చేసుకుని, ఆచరణాత్మక పరిష్కారాలను అభివృద్ధి చేయడంపై దృష్టి సారించాలని బాబా అణు పరిశోధనా సంస్థ పూర్వ శాస్త్రవేత్త, ముంబైచి విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ కె.ఇందిరా ప్రియదర్శిని సూచించారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లోని రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'సాంకేతికశాస్త్రం అభివృద్ధికి ప్రాథమిక పరిశోధన-రసాయ, జీవశాస్త్రాల సమన్వయంలో సవాళ్లు, అవకాశాలు' అనే అంశంపై మంగళవారం ఆమె అతిథ్య ఉపన్యాసం చేశారు. రసాయన, జీవశాస్త్ర రంగాల్లో ప్రాథమిక పరిశోధన, సాంకేతిక అభివృద్ధిపై ఆమె విలువైన అంతర దృష్టిలను అందించడంతో పాటు కర్క్యుమిన్, సెలినియంలపై తన పరిశోధనా ఫలితాలను సదస్సులతో పంచుకున్నారు. పరిశోధకులు సృజనాత్మకంగా యోచించాలని, ప్రాజెక్టులను ఇతరుల సహకారంతో చేపట్టాలని, వినూత్న ఆలోచనలను ప్రత్యక్ష ఉత్పత్తులుగా మార్చి, మేధో హక్కులను పొందడం లక్ష్యంగా పెట్టుకోవాలని ఆమె సూచించారు. ప్రశ్నలను అడగమని ప్రోత్సహిస్తూ, వాటికి వివరణాత్మక జవాబులిచ్చారు. తొలుత, రసాయనశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియాబేగం అతిథిని సదస్సుకు పరిచయం చేసి, ఇతర సహోధ్యాపకులతో కలిసి సత్కరించారు. తరువాతి తరం పరిశోధకులను వినూత్నంగా ఆలోచించేలా, పనిలో శ్రేష్ఠత కోసం ప్రయత్నించేలా ప్రేరేపించేలా సాగిన ఈ ఆతిథ్య ఉపన్యాసంలో పలువురు అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య దేశాభివృద్ధికి దోహదం

- సినీ నటుడు సుమన్



మొక్క నాటుతున్న సుమన్

కొండపాక, జూలై 16: క్రమశిక్షణ, సంస్కృతి, విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందిస్తే.. అది దేశాభివృద్ధికి దోహదపడుతుందని సినీనటుడు సుమన్ అన్నారు. సిద్దిపేట జిల్లా కొండపాక శివారులోని సత్యసాయి ప్రశాంతి నికేతనం కళాశాల ఆవరణలో మంగళవారం మొక్కలు నాటి విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. తల్లి, తండ్రి లేని పిల్లలకు, నిరుపేద కుటుంబాల పిల్లలకు విద్యా, వైద్యం, పోషకాహారం అందిస్తున్న సద్గురు మధుసూదనసాయి అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించి సంస్కృతీ, సంప్రదాయాలు, విద్య తోపాటు కళలు, సంగీతం తదితర అంశాలను అందిస్తూ వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపుతున్న కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు. విద్యార్థులు, ప్రతీ మహిళ మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొంది ఆత్మస్థైర్యంతో నిలబడాలన్నారు. ఎమ్మెస్సీ మేథమాటిక్స్‌లో గోల్డ్‌మెడల్ సాధించిన దివ్యభారతిని సుమన్ శాలువా కప్పి అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన భక్తి గీతాల నృత్యాలు అలరించాయి. అనంతరం సుమన్‌ను కళాశాల చైర్‌పర్సన్ పూర్ణిమశంకర్, కార్యదర్శి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ సునయన, డిప్యూటీ చైర్‌పర్సన్లు రేష్మ కుందర్, మానస, కార్యదర్శి శంకర్ అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో పాటు చదువులోనూ రాణించాలి: మున్సిపల్ చైర్‌పర్సన్



సిద్దిపేటలోని ఫుట్‌బాల్ మైదానంలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మంజులారాజనర్సు

సిద్దిపేట టౌన్, జూలై 16: క్రీడలతో పాటు చదువులో కూడా రాణించి, మీ తల్లిదండ్రులకు, మీ కోచ్‌లకు మంచిపేరు తీసుకరావాలని సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సు సూచించారు. మంగళవారం సిద్దిపేటలోని ఫుట్‌బాల్ మైదానంలో తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్, సిద్దిపేట ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-17 బాలికల ఫుట్‌బాల్ జట్టు క్రీడాకారుల శిక్షణా శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పట్టణంలో అన్ని క్రీడలను ఉత్తేజపరుస్తూ, క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, సిద్దిపేట ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అక్బర్‌నవాబ్, కౌన్సిలర్ మల్లికార్జున్, బీఆర్ఎస్ నాయకులు దరిపల్లి శ్రీనివాస్, కోచ్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని మహిళ మృతి

- ఘటన జరిగి ఆరురోజులైనా స్పందించని పోలీసులు
- పోలీస్‌స్టేషన్ ఎదుట కుటుంబసభ్యులు, గ్రామస్థుల ఆందోళన



పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేపడుతున్న మృతురాలి కుటుంబసభ్యులు, గ్రామస్థులు



లక్ష్మి(ఫైల్)

వెల్దుర్తి, జూలై 16: ద్విచక్ర వాహనం ఢీకొని గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినా నిందితుడిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో బాధిత కుటుంబసభ్యులు, గ్రామస్థులు మంగళవారం పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. వెల్దుర్తి మండలం ధర్మారం గ్రామానికి చెందిన బర్ల లక్ష్మి(52) తన కోడలు జ్యోతితో కలిసి గురువారం పని నిమిత్తం వెల్దుర్తి పట్టణానికి వచ్చింది. స్థానిక బాలాజీ ఆస్పత్రి వద్ద పట్టణానికి చెందిన సల్మాన్ అనే యువకుడు ద్విచక్ర వాహనంతో లక్ష్మిని ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. చికిత్స నిమిత్తం ఆమెను హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. ఘటనకు సంబంధించి పోలీస్‌స్టేషన్‌లో బాధిత కుటుంబసభ్యులు గత శనివారం ఫిర్యాదు చేశారు. ఘటన జరిగి ఆరురోజులు గడవగా, ఫిర్యాదు చేసి నాలుగు రోజులు గడిచినా పోలీసులు నిందితుడిని కానీ, బైక్‌ను కానీ స్వాధీనం చేసుకోకపోవడంతో బాధిత కుటుంబసభ్యులు, గ్రామస్థులు పోలీస్‌స్టేషన్ ఎదుట మంగళవారం ఆందోళన చేపట్టారు. ఎస్ఐ నవతాగౌడ్, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం బాధిత కుటుంబసభ్యులు, గ్రామస్థులు మాట్లాడుతూ.. చిన్న చిన్న ఫిర్యాదులపై ఫోన్‌చేసి పిలిచే పోలీసులు.. ఒక మహిళ మృతిచెందినా ఎందుకు పట్టించుకోవడం లేదని ఎస్ఐని నిలదీశారు. వెల్దుర్తికి చెందిన పలువురు నాయకులతో కుమ్మక్కై ఎస్ఐ నవతాగౌడ్ నిందితుడికి అండగా నిలిచారని ఆరోపించారు. ఇదిలా ఉండగా ఎస్ఐ నవతాగౌడ్ తూప్రాన్ సర్కిల్ పరిధిలోని పలు పోలీస్‌స్టేషన్ల నుంచి పోలీసులను బందోబస్తుకు పిలవడంపై బాధితులు అనుమానం వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేసే ఉద్దేశం లేకనే బెదిరింపులకు గురిచేసేందుకు ముందస్తు బందోబస్తును ఎస్ఐ పిలిచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీస్ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు తమకు న్యాయం చేయాలని, లేకపోతే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కాగా మృతురాలి భర్త కిషన్, కుమారుడు శేఖర్ గతంలోనే మృతిచెందారు. కోడలు జ్యోతి, మనుమడు ఆదిత్య ఉన్నారు. ఘటనకు కారణమైన యువకుడిని బుధవారం పిలుస్తామని పోలీసులు హామీఇవ్వడంతో ఆందోళన విరమించారు.

నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు

- గ్రామాల్లో రోడ్లపైనే చెత్తాచెదారం ● ప్రజాధనం వృథా ● పట్టించుకోని అధికారులు



నిరుపయోగంగా ఉన్న డంపింగ్‌యార్డు

ఝరాసంగం, జూలై 16: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ మెరుగుపర్చడంతో పాటు, గ్రామపంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చాలనే సంకల్పంతో గత ప్రభుత్వ హయాంలో పల్లెప్రగతిలో భాగంగా లక్షలు వెచ్చించి డంపింగ్‌యార్డులను నిర్మించారు. అయితే వీటి నిర్వహణను గాలికి వదిలేయడంతో అవి నిరుపయోగంగా మారాయి. దీంతో ప్రజాధనం వృథాగా మారింది. సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలంలో 33 గ్రామపంచాయతీలు ఉన్నాయి. జాతీయ ఉపాధిహామీ కింద ఒక్కొక్క పంచాయతీకి రూ.2.50 లక్షలతో కంపోస్టు షెడ్లు నిర్మించారు. దీంతో చెత్తను తరలించేందుకు ప్రతీ పంచాయతీకి ట్రాక్టర్‌ను సైతం కొనుగోలు చేశారు. షెడ్ల నిర్మాణం పూర్తయినా అవి పూర్తిస్థాయిలో ఉపయోగంలోకి రావడం లేదు. కొన్ని పంచాయతీల్లో ప్రారంభంలో కొంతమేర ఆసక్తి కనబర్చిన అధికారులు.. వాటిని పట్టించుకోకపోవడం వల్ల నిరుపయోగంగా మారాయి. పారిశుధ్య సిబ్బంది తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంపింగ్‌యార్డుకు తరలించాలి. అక్కడ కంపోస్టు షెడ్డులో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన అరలలో తడి, పొడి చెత్తను వేరుచేయాలి. వర్మీ కంపోస్టు తయారుచేసి అమ్మగా వచ్చిన సొమ్మును గ్రామపంచాయతీ అభివృద్ధికి వినియోగించాలి. తడి చెత్తను దాదాపు 45 రోజులపాటు దశలవారీగా ఎరువు తయారు చేయాల్సి ఉండగా.. ఆచరణలో మాత్రం అమలుకావడం లేదు. కనీసం ప్రజలకు తడి, పొడి చెత్తపై కూడా అధికారులు అవగాహన కల్పించడం లేదు.

అధికారుల పర్యవేక్షణ లోపం

మండలంలోని పలు గ్రామాల్లో చెత్తను డంపింగ్‌యార్డులకు తరలించడం లేదు. గ్రామాల్లో చెత్త రోడ్లు, డంపింగ్ యార్డుల బయట దర్శనమిస్తున్నాయి. చెత్త నుంచి తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతుంది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో రోగాలు వచ్చే అవకాశం ఉన్నది. అధికారుల పర్యవేక్షణ లోపంతో చెత్తను డంపింగ్‌యార్డులకు తీసుకెళ్లకుండా ఎక్కడపడితే అక్కడ వేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.



డంపింగ్‌యార్డు బయట పారబోసిన చెత్తాచెదారం

జిల్లా అధికారి ఆదేశించినా స్పందన కరువు

జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా కొన్నిరోజుల క్రితం మండల కేంద్రమైన ఝరాసంగంతో పాటు, కప్పాడ్ గ్రామాల్లో ఏర్పాటుచేసిన డంపింగ్‌యార్డులను పరిశీలించి, అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ అధికారుల్లో స్పందన లేకుండాపోయింది. డంపింగ్‌యార్డులకు తడి, పొడి చెత్తను తరలించకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండకపోవడం కూడా డంపింగ్‌యార్డుల పరిస్థితి అధ్వానంగా మారింది.

సెగ్రిగేషన్ షెడ్లను ఉపయోగంలోకి తీసుకురావాలి



గ్రామాల్లో ఏర్పాటుచేసిన డంపింగ్ యార్డులను వినియోగంలో తీసుకురావాలి. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని డంపింగ్‌యార్డు, రోడ్ల పక్కన చెత్తాచెదారం వేయకుండా చూడాలి. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలి.

\- యాదవరెడ్డి, గుంతమర్పల్లి

నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలి

● వీసీ నీరజ ప్రభాకర్



ములుగు/గజ్వేల్, జూలై 16: వనమహోత్సవలో భాగంగా నాటిన ప్రతీ మొక్కను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కొండా లక్ష్మణ్ బాపూజీ ఆర్టికల్చర్ యూనివర్సిటీ వీసీ నీరజ ప్రభాకర్ అన్నారు. మండలంలోని కొట్టాలలో ఆర్టికల్చర్ యూనివర్సిటీ కోసం కేటాయించిన స్థలంలో మంగళవారం వనమహోత్సవం భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు ఉన్నారు.

మొక్కలే జీవకోటికి ప్రాణాధారమని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ రాజమౌళి పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో 75వ వన మహోత్సవంలో భాగంగా మంగళవారం పూలు, పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని, చెట్లే ప్రగతికి మెట్లని అన్నారు. ఆయనవెంట మునిసిపల్ కమిషనర్ గొల్కొండ నరసయ్య, వైస్ చైర్మన్ జకీయోద్దీన్, కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, రహీం, అత్తెల్లి శ్రీనివాస్, తలకొక్కుల దుర్గాప్రసాద్, బాలమణి, షహనాజ్‌సమీర్, బొగ్గుల చందు, నాయకులు, ఆయా శాఖల అధికారులు, మెప్మా సిబ్బంది, తదితరులు ఉన్నారు.

తడి, పొడి చెత్తను వేరుచేసి ఇస్తున్నారా?

● పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

● సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి

సిద్దిపేట టౌన్, జూలై16: ప్రతీరోజు మీ వార్డుకు వస్తున్న మున్సిపల్ చెత్త సేకరణ వాహనానికి తడి, పొడి, హానికర చెత్తను వేరు చేసి ఇస్తున్నారా? అని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ కే. ప్రసన్నరాణి పలువురు మహిళలను ఆరాతీశారు. సిద్దిపేట పట్టణంలోని 7వ వార్డులో మంగళవారం ఆమె పర్యటించారు. ఈ మేరకు హనుమాన్ ఆలయంలో అసంపూర్తిగా ఉన్న టైల్స్ పని పూర్తి చేయాలని, కాలనీలో యూజీడీ కనెక్షన్ కొంతమేరకు పూర్తి కాలేదని, కాలనీలో యూజీడీ పనులు ప్రారంభించి ప్రతీ ఇంటికి కనెక్షన్ ఇప్పించాలని, పలు సమస్యలను కాలనీవాసులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో పాటు కాలనీలో ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలు ఉన్నందున పాములు, కీటకాలు వస్తున్నాయని ఆమె దృష్టికి తీసుకురాగా, వెంటనే పిచ్చి మొక్కలుపెరిగిన ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేయాలని టౌన్‌ప్లానింగ్ సిబ్బందిని ఆదేశించారు. వార్డులో శిథిలావస్థకు చేరిన గృహాలకు నోటీసులు జారీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలం దృష్ట్యా ఇంటి ఆవరణలో టైర్లు, హౌజ్‌లు వంటి వాటిలో నీరు నిల్వ ఉంచకుండా చూసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉండడం వల్ల దోమల వృద్ధి చెంది మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలుతాయని, కావునా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు ముత్యాల బుచ్చిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మాధవి తదితరులు పాల్గొన్నారు.



సిద్ది పేట టౌన్: కాలనీవాసులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్



తొగుట: గుడికందులలో సిబ్బందితో కలిసి గడ్డి మందు పిచికారి చేస్తున్న సొసైటీ చైర్మన్

వ్యక్తిగత పరిశుభ్రతపాటించాలి

గజ్వేల్, జూలై 16: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కౌన్సిలర్ ఎండీ రహీం కోరారు. గజ్వేల్ పట్టణంలోని 10వ వార్డులో మంగళవారం డెమోఫాస్ మందును పిచికారి చేయించారు. ఆయనవెంట ఎపిడిమిక్ సభ్యుడు దేవసాని వాసుదేవ్, డి.నాగరాజు, హెల్త్ అసిస్టెంట్ రమేశ్, ఫీల్డ్ వర్కర్ జుబేదా బేగం, మంజుల, ఆశావర్కర్లు ఉన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

తొగుట, జూలై16: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కాసల్ కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ కన్నయ్య గారి హరికృష్ణ రెడ్డి సూచించారు. మండలంలోని గుడికందులలో మంగళవారం గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి రోడ్లకు ఇరువైపులా గడ్డి మందు పిచికారి చేసి డ్రైనేజీలపై బ్లీచింగ్ పౌడర్‌ను చల్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల ప్రజలందరూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గ్రామపంచాయతీలలో నిధుల కొరత వేధిస్తోందని, పంచాయతీ కార్యదర్శులు మానవత దృక్పథంతో పనిచేయాలని కోరారు. వర్షపు నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు పెరిగి విష జ్వరాలు వ్యాపించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు చింత భైరారెడ్డి, ఉప్పరి సతీష్ గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కారు, ఆటో ఢీ.. మహిళ మృతి

కోహెడ, జూలై 16: ఆటోను కారు ఢీకొనడంతో ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని శనిగరం శివారులో మంగళవారం చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. బెజ్జంకి మండలం రేగులాపల్లికి చెందిన కొమ్మర లక్ష్మి(64) అనే మహిళ చిగురుమామిడి నుంచి ఆటోలో రేగులాపల్లికి వెళ్తున్నది. ఈ క్రమంలో కరీంనగర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు అతివేగంతో ఆటోను వెనక నుంచి ఢీకొట్టడంతో ఆటో బోల్తాపడి అందులో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. మృతురాలి భర్త రాంరెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అగ్ని ప్రమాదంలో పశుగ్రాసం దగ్ధం

వర్గల్, జూలై 16: అగ్ని ప్రమాదంలో రూ. 2లక్షల విలువ చేసే ఎండు గడ్డి దగ్ధమైంది. ఈ సంఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకున్నది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన అన్నంరాజు ప్రభాకర్‌రావు అనే రైతు ఇంటి సమీపంలో గడ్డి వాము ఏర్పాటు చేసుకున్నాడు. గడ్డి వర్షానికి తడవకుండా ప్లాస్టిక్ కవర్ ఏర్పాటు చేశాడు. మంగళవారం సాయంత్రం సమయంలో గడ్డి వాము నుంచి పొగలు వ్యాపిస్తూ మంటలు చెలరేగడంతో ప్రభాకర్‌తో పాటు అతని కుటుంబసభ్యులు, స్థానికులు మంటలను ఆర్పడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. గజ్వేల్ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకున్న వారు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే గడ్డి వాము పూర్తిగా కాలి బుడిదైంది. రూ 2లక్షల విలువ చేసే గడ్డి బూడిదైనట్లు బాధితుడు వాపోయాడు.



మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

నిషేధిత గుట్కా స్వాధీనం

మర్కుక్, జూలై 16: మండల పరిధిలోని కర్కపట్లలో మంగళవారం సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు, మర్కుక్ పోలీలు తనిఖీలు నిర్వహించి ప్రభుత్వం నిషేధించిన గుట్కా ప్యాట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ అధికారులు మాట్లాడుతూ.. మర్కుక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కర్కపట్లలో మోహన్‌లాల్, కుమావత్ మహేందర్ కిరాణాషాపుల్లో ప్రభుత్వం నిషేధించిన గుట్కాప్యాకెట్లను విక్రయిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో తనిఖీ చేసి రూ. 16,000 విలువ చేసే గుట్కా ప్యాకెట్లు పట్టుకున్నామన్నారు. ఈ తనిఖీల్లో మర్కుక్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

'గోదావరి జలాలతో చెరువులను నింపాలి'

దూళిమిట్ట, జూలై 16: తపాస్‌పల్లి, వెల్దండ రిజర్వాయర్‌లను గోదావరి జలాలతో యుద్ధ ప్రాతిపదికన నింపి కాలువల ద్వారా మండలంలోని చెరువులను నింపాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చొప్పరి రవికుమార్ మాట్లాడుతూ.. వందల ఎకరాల్లో రైతులు వరినార్లు పోసుకుని సరియైన వర్షాలు పడక ఆందోళన చెందుతున్నారని, వెంటనే ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి దూళిమిట్ట మండలంలోని చెరువులను నింపి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చొప్పరు ప్రసాద్, ప్రభాకర్, మహేష్, కిష్టయ్య, కనకయ్య, రాజేందర్, సంపత్ తదితరలు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

సిద్దిపేట క్రైం జూలై 16: ప్రపంచ పాముల దినోత్సవం సందర్భంగా మంగళవారం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జంతుశాస్త్ర విభాగ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జంతుశాస్త్ర విభాగాధిపతి అయోధ్యరెడ్డి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సీహెచ్ ప్రసాద్ మాట్లాడుతూ.. పాముల గురించి తెలిసిన ప్రతీ విద్యార్థి ఇతర విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. జంతు శాస్త్ర విభాగాధిపతి అయోధ్యరెడ్డి మాట్లాడుతూ.. పాము కనబడగానే చంపకూడదని అది విషరహిత సర్పమా?, విషపూరిత సర్పమా? తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో జంతుశాస్త్ర అధ్యాపకులు కె.విశ్వనాథం, ఎం.మధుసూదన్‌రెడ్డి, డి.పుణ్యమ్మ, జి.వెంకటేశం, బి.చక్రవర్తి విద్యార్థులు పాల్గొన్నారు.

ఏడుగురు పంచాయతీ సెక్రటరీల బదిలీ

మద్దూరు, జూలై 16: మద్దూరు ఉమ్మడి మండలంలోని ఏడు గ్రామాల పంచాయతీ సెక్రటరీలకు బదిలీలయ్యాయి. గ్రామపంచాయతీల్లో నాలుగేళ్లకు మించి పని చేస్తున్న వారు సాధారణ బదిలీల్లో భాగంగా బదిలీ అయ్యారని ఎంపీవో ఖాజామొయినుద్దీన్ తెలిపారు. మద్దూరు మండలంలోని సలాఖ్‌పూర్ గ్రామ పంచాయతీ సెక్రటరీ కిరణ్ ఇదే మండలం వంగపల్లికి, వంగపల్లి గ్రామ పంచాయతీ సెక్రటరీ బాలనర్సయ్య కొమురవెల్లి మండలం రసూలాబాద్‌కు, దూళిమిట్ట మండలం బెక్కల్ గ్రామపంచాయతీ సెక్రటరీ సిద్దేశ్వర్ ఇదే మండలం దూళిమిట్టకు, కొండాపూర్ గ్రామ పంచాయతీ సెక్రటరీ అశోక్ మద్దూరు మండలం సలాఖ్‌పూర్‌కు, తోర్నాల గ్రామపంచాయతీ సెక్రటరీ నరేష్ చేర్యాల మండలం ముస్త్యాలకు, హన్మతండా గ్రామపంచాయతీ సెక్రటరీ సదానందం కోహెడ మండలం వెంకటేశ్వరపల్లికి, దుబ్బతండా గ్రామ పంచాయతీ సెక్రటరీ నవీన్ కోహెడ మండలం విజయనగరకాలనీకి బదిలీపై వెళ్లగా ఎంపీడీవో కార్యాలయంలో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్ ముదస్సీర్ చేర్యాల ఎంపీడీవో కార్యాలయానికి బదిలీ అయ్యారు.

ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు

కుకునూరుపల్లి, జూలై 16: రోడ్డుకు ఇరువైపులా ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలను కుకునూరుపల్లి వేద పాఠశాల యాజమాన్యం తొలగించింది. మంగోల్ నుంచి తిప్పారం, మాత్‌పల్లి నుంచి కొనాయిపల్లి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా చెట్ల కొమ్మలు వాహనదారులకు తాకుతూ చాలా ప్రమాదకరంగా ఉన్నాయి. రోడ్డు కనబడకుండా చెట్ల కొమ్మలు ప్రమాదకరంగా రోడ్లపైకి రావడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో స్వచ్ఛందంగా పాఠశాల యాజమాన్యం వాటిని తొలగించింది.

మహిళా శక్తి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలి

● డీఆర్డీవో జయదేవ్ ఆర్య

గజ్వేల్, జూలై 16: మహిళా శక్తి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీవో జయదేవ్ ఆర్య పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలోని ఐఓసీలో మహిళాశక్తి కార్యక్రమంపై ఐదు మండలాల ఏపీఎంలు, సీసీలు, వీవోఏలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాడిగేదెలు, ఆవులు, పౌల్ట్రీ మదర్ యూనిట్, పెరటి కోళ్ల పెంపకం, డైరీ పార్లర్, పీఎంఎఫ్ఎఈ యూనిట్స్, మొబైల్ ఫిష్ అవుట్ లెట్, వ్యవసాయ పరికరాల అద్దె, స్టిచ్చింగ్, న్యూఎంటర్‌ప్రైజెస్, ప్లాస్టిక్ వెస్టుమ్యానేజ్‌మెంట్, ఎంఎస్ క్యాంటీన్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, సోలార్ పవర్ యూనిట్ల విషయమై అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్డీవో ఏపీడీ తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ కోసం తవ్వి వదిలేశారు

ములుగు, జూలై 16: పైప్‌లైన్‌ల కోసం కాలువ లు తవ్వి వదిలేయంతో స్థానికులు తవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని వంటిమామిడి రాజీవ్‌రహదారిపై రెండు నెలల క్రితం గ్యాస్ పైప్‌లైన్ కోసం దుకాణంలో ముందు కాలువలు తీసి వదిలేశారు. ఆ కాలువలు దాటుతుండగా ఒకరిద్దరు కాల్వలో జారిపడిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత కాంట్రాక్టర్లు కాల్వ పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.



తవ్వి వదిలేసిన కాలువ



దుబ్బాక బస్టాండ్ ప్రవేశ ద్వారం చినుకు పడితే చాలు బురదగుంతలుగా మారి, బస్టాండ్‌లోకి వచ్చే ప్రయాణికులకు, వాహనాలకు ఇబ్బందిగా తయారైంది. సుమారు 5 కోట్లతో నిర్మించిన బస్టాండ్ ప్రవేశం ద్వారం దగ్గర గుంతలు ఏర్పడడం పలు విమర్శలకు దారి తీస్తున్నది. బస్టాండ్‌లోకి వచ్చే వృద్ధులు, పిల్లలు బురదగుంటలకు దాటేందుకు నానాతంటాలు పడుతున్నారు. అదే సమయంలో వాహనాలు అటువైపు వస్తే బురద ప్రయాణికులపై పడుతున్నది. బురదగుంతలను పూడ్చాలని వారు కోరుతున్నారు.

- దుబ్బాక

లాఠీచార్జ్‌కు నిరసనగా మహాత్మాగాంధీకి వినతి

సిద్దిపేట క్రైం, జూలై 16: నిరుద్యోగులపై హైదరాబాద్‌లో సోమవారం జరిగిన లాఠీచార్జ్‌కి నిరసనగా మంగళవారం సిద్దిపేట కేంద్రంలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో కళాశాలలు బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు పయ్యావులశ్యామ్ మాట్లాడుతూ.. గ్రూపు 2, 3 పోస్టులను పెంచాలని, డీఎస్సీని వాయిదా వేయాలని హైదరాబాద్‌లోని చిక్కడపల్లి లైబ్రరీ వద్ద శాంతియుతంగా ఆందోళన చేస్తున్న నిరుద్యోగులపై లాఠీచార్జ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించడం దారుణం అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలపై మాట నిలుపుకోవాలని, లేని పక్షంలో నిరుద్యోగుల ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరుద్యోగులను పోలీస్‌స్టేషన్లో నిర్బంధించడం సిగ్గుచేటు అన్నారు. నిరుద్యోగులు తీవ్రవాదులు కాదని తెలంగాణ బిడ్డలేనన్నారు. కాంగ్రెస్ నాయకుల ప్రోద్బలంతోనే నిరుద్యోగులపై విచక్షణరహితంగా లాఠిచార్జ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారని ఆరోపించారు. ఇప్పటికైనా నిరుద్యోగల డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చిన్నకోడూరు మండల అధ్యక్షుడు గుజ్జ రాజు, నంగునూరు మండల అధ్యక్షుడు గోవిందారం రవి, సిద్దిపేట రూరల్ మండలం అధ్యక్షుడు బండి శ్రీకాంత్, సిద్దిపేట పట్టణ సమన్వయకర్త ఇరుగంటి రమేష్, అరవింద్‌రెడ్డి, మధు, చెట్లపల్లి భానుచందర్, కర్రోల సతీష్, గుర్రం సతీష్‌రెడ్డి, మీరుగు మాధవ్, పడిగ లింగం, మైలారం వంశీ, వల్లపు సంపత్, పోతుల నరేష్, పిట్ల రాకేష్, శ్రవణ్‌గౌడ్, ఎక్కాల గోపి, ఆదర్శ్, నాగరాజు పాల్గొన్నారు.



మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్నబీఆర్ఎస్వీ నాయకులు

రుణమాఫీపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

● మాజీ ఎంపీపీ లింగాల నిర్మల

బెజ్జంకి, జూలై 16: ప్రభుత్వానికి రెండు లక్షల రుణమాఫీపై చిత్తశుద్ధి లేదని మాజీ ఎంపీపీ లింగాల నిర్మల పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతు రుణమాఫీకి రేషన్‌కార్డు ప్రమాణికం కాదని చెప్పిన సీఎం మాట మార్చారని, రేషన్‌కార్డు లేని రైతుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. రైతుల నుంచి రుణమాఫీపై ఫిర్యాదులు కోరడం వెనక ఆంతర్యం ఏమిటని ప్రశించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రమేష్, లక్ష్మణ్, మల్లేశం, నరేష్, శేఖర్ బాబు, రామలింగారెడ్డి, సుదర్శన్, మోహన్, బాబుమియా, శంకర్ పాల్గొన్నారు.



బెజ్జంకిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ నిర్మల, తదితరులు

రుణమాఫీకి షరతులు వద్దు

నారాయణరావుపేట, జూలై16: అధికారంలోకి వచ్చిన వెంటనే రుణమాఫీ చేస్తామని రైతులకు మాయమాటలు చెప్పిన కాంగ్రెస్ ఇప్పుడు అధికారంలోకి రాగానే రుణమాఫీ విషయంలో రైతులకు షరతులు పెట్టడం సబబు కాదని బీజేపీ సిద్దిపేట జిల్లా అధికార ప్రతినిధి రమేష్ గౌడ్ విమర్శించారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రెండు లక్షల రుణం ఏకకాలంలో మాఫీ చేస్తామని చెప్పి రుణమాఫీ చేసే సమయానికి రైతులకు షరతులు విధించడం రోడ్డున పడేయడమేనన్నారు రేషన్‌కార్డునే ప్రామాణికం చేయడం సరికాదన్నారు. షరతులు లేకుండా రెండు లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

18న గజ్వేల్ నియోజకవర్గ సీపీఐ తసర్వసభ్య సమావేశం

గజ్వేల్, జూలై 16: ఈ నెల 18న సీపీఐ గజ్వేల్ నియోజకవర్గ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు సీపీఐ గజ్వేల్ నియోజకవర్గ కన్వీనర్ శివలింగు కృష్ణ తెలిపారు. గజ్వేల్ పట్టణంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గజ్వేల్ పట్టంలోని ఓ గార్డెన్స్‌లో ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి, రాష్ట్ర నాయకుడు ప్రకాశం, సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణపురం లక్ష్మణ్‌లు హాజరుకానున్నట్లు తెలిపారు.

ఇసుక వేలం

వర్గల్/చిన్నకోడూరు, జులై 16: మండలంలోని సీతారాంపల్లి, వేలూర్ శివారు ప్రాంతంలోని గురువన్నగుట్ట వద్ద అక్రమంగా నిల్వ చేసిన రెండున్నర లారీల ఇసుక డంప్‌ను రెవెన్యూ అధికారులు సోమవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. ఆ ఇసుకను గురువారం మధ్యాహ్నం 12.00 గంటలకు వేలం వేయనున్నట్లు తహసీల్దార్ బాల్‌రాజ్ తెలిపారు.

చిన్నకోడూరు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిల్వ ఉన్న సుమారు 3 లారీల ఇసుకను ఈనెల 23న ఉదయం 11 గంటలకు కార్యాలయ ఆవరణలో బహిరంగ వేలం వేయనున్నట్లు తహసీల్దార్ జయలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా గణపతిరావు

గజ్వేల్, జూలై 16: గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా గణపతిరావుకు పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ మేరకు మంగళవారం గణపతిరావు బాధ్యతలు చేపట్టారు. గత నెలలో ప్రిన్సిపాల్‌గా పదవీవిరమణ పొందిన శ్రీనివాస్‌రెడ్డి స్థానంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా గణపతిరావుకు బాధ్యతలను అప్పగించిన ప్రభుత్వం పూర్తిస్థాయి ప్రిన్సిపాల్‌గా నియమించింది.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా స్వామి



నియామకపత్రం అందజేస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

రాయపోల్, జూలై 16: సిద్దిపేట జిల్లా బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా మండలంలోని బేగంపేటకు చెందిన తిగుళ్ల స్వామిని నియమించారు. ఈ మేరకు మంగళవారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ నియామకపత్రం అందజేసి సంఘం కండువా కప్పారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ.. బీసీల హక్కుల కోసం నిరంతరం పోరాడుతానని తెలిపాడు.

బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా వీరాచారి

అక్కన్నపేట, జూలై 16: బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మండలంలోని గౌరవెల్లికి చెందిన గొల్లపల్లి వీరాచారిని నియమిస్తూ బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి మంగళవారం నియామకపత్రాన్ని అందజేశారు. తన నియామకానికి సహకరించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగిడి మోహన్‌రెడ్డి, కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపాడు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత

దౌల్తాబాద్, జూలై 16: పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను సీఈఐఆర్‌తో కనుగొన్న పోలీసులు మంగళవారం బాధితులకు అందజేశారు. మండల పరిధిలోని ముబారస్‌పూర్‌కు చెందిన సట్ట రమేష్, శేరిపల్లిబందారంకు చెందిన జక్కుల రాధిక ఫోన్లు పోగొట్టుకున్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీఈఐఆర్ ద్వారా ఆ సెల్‌ఫోన్లను గుర్తించారు. మంగళవారం ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ పోలీస్టేషన్‌లో అందజేశారు.

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ..

చేర్యాల, జూలై 16: కొమురవెల్లి మండలం గురువన్నపేటకు చెందిన దండు రమేశ్ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్యానికయ్యే ఖర్చులు భరించే స్థోమత లేక ఇబ్బందులుపడుతున్న విషయాన్ని కుటుంబసభ్యులు జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన దేవాదాయశాఖమంత్రి కొండా సురేఖకు వారి పరిస్థితిని వివరించి రూ.1.25లక్షల సీఎంఆర్‌డీ ఎల్‌వోసీని మంజూరు చేయించారు. మంగళవారం ఎల్‌వోసీ ప్రతిని కుటుంబసభ్యులకు అందజేశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్, బుడిగె భిక్షపతి, వీరేశం పాల్గొన్నారు.

ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్ ఆవిష్కరణ

మద్దూరు, జూలై 16: మండల కేంద్రంలో మంగళవారం సిద్దిపేట జిల్లా ఫొటో వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని కేబీఆర్ కన్వెన్షన్‌లో మూడు రోజుల పాటు నిర్వహించే ఫొటోట్రేడ్ ఎక్స్‌పోను విజయవంతం చేయాలని జిల్లా ఫొటోగ్రాఫర్ల సంఘం అసోసియేషన్ అధ్యక్షుడు దొంతుల శ్రీకాంత్ కోరారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు గొట్టిపర్తి పరమేశ్వర్, కొరిగింజ శేఖర్, మద్దూరు మండల ఉపాధ్యక్షుడు దాసు మహేందర్, కార్యవర్గ సభ్యులు రాము పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

అక్కన్నపేట, జూలై 16: మండలంలోని బోదరువాగుతండాకు చెందిన గుగులోతు రూప్‌సింగ్ అనే రైతుకు చెందిన పాడి గేదె మంగళవారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. రూ.80 వేలు విలువచేసే పాడి గేదె మృతి చెందడంతో రైతు కన్నీరు మున్నీరుగా విలపించాడు.

మొక్కులు చెల్లించుకున్న ఎంపీ రఘునందన్‌రావు

గజ్వేల్, జూలై 16: బీజేపీ గజ్వేల్ నియోజకవర్గ అధ్యక్షుడు విజయవాడలో కనకదుర్గమ్మకు మొక్కులు చెల్లించుకున్నాడు. మెదక్ ఎంపీగా రఘునందన్‌రావు గెలుపొందడంతో ఆయనతో కలసి విజయవాడలో మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి కుడిక్యాల రాములు, ఆయా మండలాల అధ్యక్షులు మనోహర్‌యాదవ్, సాయిరెడ్డి రాంరెడ్డి, దాసరి ఐలయ్యయాదవ్, మన్నె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సదానంద్‌గౌడ్ ఉన్నారు.

● కుకునూరుపల్లి: మెదక్ ఎంపీ రఘునందన్‌రావును కుకునూరుపల్లి బీజేపీ మండల అధ్యక్షుడు సంపత్‌రెడ్డి కలిశారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో మెదక్ ఎంపీగా రఘునందన్‌రావు గెలుపొందడంతో బీజేవైఎం రాష్ట్ర నాయకుడు సంతోష్‌గౌడ్ పాదయాత్ర చేసి మంగళవారం విజయవాడకు చేరుకున్నారు. అక్కడ ఎంపీ రఘునందన్‌రావుతో కలిసి మొక్కును చెల్లించుకున్నారు. సందర్భంగా కుకునూరుపల్లి మండల అధ్యక్షుడు సంపత్‌రెడ్డి రఘునందన్‌రావుని కలిశారు. ఆయన వెంట సదానందగౌడ్ తదితరులు ఉన్నారు.



గజ్వేల్: విజయవాడలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావుతో గజ్వేల్ బీజేపీ నాయకులు

దుర్గమ్మకు పూజలు

చేర్యాల, జూలై 16: వారాహీమాత నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని చేర్యాల పట్టణంలోని దుర్గమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చతుశ్శష్టి ఉపచారపూజ, ఫల, పుష్పాభిషేకాలు నిర్వహించారు. అనంతరం మహాఅన్నదానం చేశారు.



చేర్యాల: దుర్గమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

కొనసాగుతున్న ఆషాడి ఉత్సవాలు



మర్కుక్: రుక్మిణి విఠలనాథుడు

మర్కుక్, జూలై 16: మండల పరిధిలోని పాండురంగాశ్రమంలో ఆషాడి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం 93వ ఆషాడి త్రిరాత్రోత్సవ ప్రారంభం గణపతి పూజ తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం రాజన్నసిరిసిల్లజిల్లా రామాజీపేటకు చెందిన విధుమౌళిశాస్త్రి భక్తబృందంతో చక్రిభజన కన్నుల పండుగగా సాగింది. కార్యక్రమంలో పాండురంగ ఆశ్రమ నిర్వాహకులు అప్పాల సత్యనారాయణశర్మ, విట్టలశర్మ, రసరాజుశర్మ, మదుసూరి వెంకటరామశర్మ, మాధవశర్మ, రాధాపతి వర్మ, భావానందశర్మ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గాంధీభవన్‌లో బోనాలు..

మద్దూరు, జూలై 16: హైద్రాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ బోనాల పండుగకు మద్దూరు మండల మహిళా అధ్యక్షురాలు గుండెగోని లలితామల్లేశం ఆధ్వర్యంలో మహిళలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా బోనాల పండగలో పాల్గొని అమ్మవారికి బోనం సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుకున్నట్లు ఆమె తెలిపారు.



మద్దూరు: బోనాల పండుగలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు

తొగుట మార్కెట్ కమిటీ పాలకవర్గం ఖరారు..!

● చైర్మన్‌గా చెరుకు విజయ్‌రెడ్డి

● వైస్ చైర్మన్‌గా కొంగరి నర్సింహులు

● త్వరలోనే ఉత్తర్వులు



చెరుకు విజయ్‌రెడ్డి



కొంగరి నర్సింహులు

తొగుట, జూలై 16: తొగుట వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ఖరారైంది. ఈ వేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడాల్సి ఉన్నది. తొగుట మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం చాలా మంది పోటీపడినప్పటికీ కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి తన అనుయాయులనే అందలం ఎక్కించినట్లు సమాచారం. మండలంలోని తుక్కాపూర్‌కు చెందిన మాజీ సర్పంచ్ చెరుకు విజయ్‌రెడ్డి (అమర్) మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, తొగుట గ్రామానికి చెందిన కొంగరి నర్సింహులు వైస్ చైర్మన్‌గా ఖరారు చేశారు. అదే విధంగా పాలకవర్గం కోసం 10 మంది డైరక్టర్లతో పాటు ఇద్దరు ట్రేడర్‌ల పేర్లతో కూడిన ఫైల్‌ను ప్రభుత్వ అనుమతి కోసం పంపారు. ప్రభుత్వ ఆమోద ముద్ర పడగానే కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారానికి తొగుటలో పెద్ద ఎత్తున ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం.



తొగుట వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

2001లో ఏర్పాటు

తొగుట మండల కేంద్రంలో 2001 డిసెంబరు 19న అప్పటి ఎమ్మెల్యే దివంగత చెరుకు ముత్యంరెడ్డి మార్కెట్ కమిటీని ఏర్పాటు చేయించారు. మార్కెట్ కమిటీ మంజూరు కాగానే మార్కెట్ యార్డులో షెడ్‌ల నిర్మాణం, కార్యాలయ భవనం, మార్కెట్ కమిటీకి ఆదాయం రావడానికి ప్రధాన రోడ్డులో షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మాణం చేపట్టారు. 2003 నుంచి 2005 వరకు మార్కెట్ అధికారుల పర్యవేక్షణలో పర్సన్ ఇన్‌చార్జిలుగా వారే విధులు నిర్వహించారు.